జాడలేని ఆహార సలహా సంఘాలు!

- రేషన్ షాపులపై కొరవడిన పర్యవేక్షణ
- నరుకుల పంపిణీలో మోసాలు
- పట్టించుకోని అధికారులు

ఇచ్ఛాపురం నియోజకవర్గంలో రేషన్ షాపుల వివరాలు

మండలం	రేషన్ షాపులు	కార్డులు
ఇచ్ఛాపురం/పట్టణం	49	27,036
కవిటి	43	22,817
కంచిలి	45	20,202
సోంపేట	55	22,406
మొత్తం	192	92,461



ఎండీయూ వాహనం ద్వారా రేషన్ పంపిణీ చేస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం రూరల్: రేషన్ షాపుల్లో అక్రమాలు జరుగకుండా, నిరుపేదలకు సక్రమంగా సరుకులు అందేలా ఆహార సలహా సంఘాలు పర్యవేక్షించేవి. గతంలో ఎంతో బాధ్యతతో వ్యవహరించే ఈ సంఘాలు నేడు ఎక్కడా కనిపించడం లేదు. సంఘాల ఉనికి లేకపోవడంతో పర్యవేక్షించాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. తుకాల్లో మోసాలు జరుగుతున్నాయని, నిత్యావసర సరుకులు సక్రమంగా అందడం లేదని లబ్ధిదారులు అంటున్నారు. గతంలో ప్రతీ మూడు నెలలకోసారి మండల స్థాయి ఆహార సలహా కమిటీ సభ్యులు సమావేశమై మండలంలో ఉన్న రేషన్ షాపుల నిర్వహణపై సమీక్షించేవారు. ప్రస్తుతం అటువంటి పరిస్థితి లేకుండా పోయింది.

సంఘాల ఏర్పాటు..బాధ్యతలు

ఇచ్ఛాపురం నియోజకవర్గంలో పరిధిలో 180 రేషన్ దుకాణాలు ఉన్నాయి. ఇచ్ఛాపురం మండలం, పట్టణం, కవిటి, కంచిలి, సోంపేట మండలాల్లో 92,461 రేషన్ కార్డులు ఉన్నాయి. ఆహార సలహా కమిటీ సంఘాలకు చైర్మన్‌గా మండల స్థాయిలో తహసీల్దార్, జిల్లా స్థాయిలో కలెక్టర్, జాయింట్ కలెక్టర్ వ్యవహరించేవారు. సభ్యులుగా ఎంపీడీవో, జెట్పీటీసీ సభ్యులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులను నామినేట్ చేసేవారు. ప్రతీ మూడు నెలలకోసారి సభ్యులు సమావేశమై ప్రజలకు సక్రమంగా రేషన్ అందించడానికి తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించేవారు. సంఘాలే లేకపోవడంతో రేషన్ పంపిణీ ఇష్టారాజ్యంగా మారిపోయిందని లబ్ధిదారులు విమర్శిస్తున్నారు.

రేషన్ పంపిణీలో అవకతవకలు

ఆహార సలహా సంఘాలు లేకపోవడంతో అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. నాణ్యతను పట్టించుకునే నాథుడే కరువయ్యారు. రేషన్ షాపుల్లో తుకాల్లో తేడాలు ఉంటున్నాయని పలువురు కార్డుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో లబ్ధిదారులకు ఎండీయూ ఆపరేటర్ల ద్వారా వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి రేషన్ అందించేవారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ వ్యవస్థ పూర్తిగా గాడి తప్పింది. రేషన్ సరుకుల సరఫరా చేసే వాహనాలను కొన్ని చోట్ల నిలిపి రేషన్ పంపిణీ చేస్తుండగా, మరికొన్ని చోట్ల వారం రోజుల ముందు నుంచే ఎండీయూ ఆపరేటర్లు లబ్ధిదారుల వేలు ముద్రలు సేకరించి అరకొర రేషన్ సరుకులు ఇస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి.

బియ్యానికే పరిమితం..

కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి రేషన్ షాపులు కేవలం బియ్యానికే పరిమితమయ్యాయి. అప్పుడప్పుడు చక్కర ఇస్తున్నారు. జగనన్న పాలనలో ప్రతి ఒక్క కార్డుదారునికి బియ్యం, చక్కర, కందిపప్పు, గోధుమ పిండి, రాగులు పంపిణీ చేసిన విషయాన్ని వారు గుర్తు చేసుకుంటున్నారు.

కొరవడిన పర్యవేక్షణ



గతంలో ఆహార సంఘాలు ఏర్పాటు చేసి సమావేశాలు నిర్వహించేవారు. దీంతో రేషన్ పంపిణీపై పర్యవేక్షణ ఉండటంతో పాటు డీలర్లు సక్రమంగా పంపిణీ చేసేవారు. రేషన్ షాపుల్లో వచ్చే లోటుపాట్లపై ఎప్పటికప్పుడు పర్యవేక్షించి పరిష్కరించేవారు. ప్రస్తుతం కమిటీలను ఏర్పాటు చేయకపోవడంతో నిత్యావసర సరుకుల పంపిణీ అస్తవ్యస్తంగా మారింది.

– పూడి కిరణ్‌కుమార్, అధ్యక్షుడు, జిల్లా యూత్ కాంగ్రెస్

చర్యలు తీసుకుంటాం



నిత్యావసర సరుకుల పంపిణీలో అవకతవకలు జరిగినట్టు లబ్ధిదారులు తమ దృష్టికి తెచ్చిన, ఫిర్యాదు చేసిన సంబంధిత వ్యక్తులపై తప్పని సరిగా చర్యలు తీసుకుంటాం. చౌక ధరల దుకాణాల పరిధిలో ఆహార సలహా సంఘాలు గతంలో ఉండేవి. ప్రస్తుతం లేవు. ప్రభుత్వం నుంచి సంఘాలు ఏర్పాటుకు ఆదేశాలు వస్తే ఏర్పాటు చేస్తాం. ప్రజా పంపిణీలో తేడాలు వచ్చినట్లు ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటామని డీలర్లను తరచూ హెచ్చరిస్తున్నాం.

– ఎస్.వెంకటరావు, తహసీల్దార్, ఇచ్ఛాపురం

అధికారులపై రెడ్ బుక్ రాజ్యాంగం తగదు

- వైఎస్సార్‌సీపీ టెక్కలి ఇన్‌చార్జి తిలక్



మాట్లాడుతున్న తిలక్

టెక్కలి: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, దళితులపై అమలు చేసిన రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని సీనియర్ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులపై కూడా అమలు చేసి అక్రమ కేసులు బనాయించడం మంచిది కాదని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో లిక్కర్ స్కాం జరిగిందంటూ కూటమి సర్కార్ అనవసరమైన రాజకీయ వ్యవహారానికి తెర తీసిందన్నారు. ఇందులో రిటైర్డ్ ఐఏఎస్ ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి తదితరులను విచారణ చేయడం వెనుక ప్రజల పక్షాన పోరాటం చేస్తున్న వైఎస్సార్‌సీపీని అణగదొక్కే ప్రయత్నమైనని తిలక్ పేర్కొన్నారు. చివరకు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై అక్రమంగా కేసులు నమోదు చేయడానికే ఇటువంటి నాటకాలకు తెర తీస్తున్నారని వెల్లడించారు. ఇచ్చిన హామీలు అమలు చేయడంలో ఘోరంగా వైఫల్యం చెందిన చంద్రబాబు ప్రజల నుంచి తప్పించుకోవడానికి ఇటువంటి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని మండిపడ్డారు. ఐఏఎస్, ఐపీఎస్ అధికారులపై కక్ష సాధించాలని చూస్తే తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు.

వేధింపులకు తగిన మూల్యం తప్పదు



సింగుపురం మోహన్‌రావు

టెక్కలి: సీనియర్ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులపై కూటమి ప్రభుత్వం చేస్తున్న వేధింపులకు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని న్యాయవాది, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు సింగుపురం మోహన్‌రావు అన్నారు. రిటైర్డ్ ఐఏఎస్ ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డిలపై కూటమి ప్రభుత్వం చేస్తున్న వేధింపులను ఆయన తీవ్రంగా ఖండించారు. ఎటువంటి ఆధారాలు లేకుండా కేవలం రాజకీయ దుమారం లేపడానికి సీనియర్ ఐఏఎస్ అధికారులను విచారణ చేయడం మంచి పద్ధతి కాదన్నారు. అధికారులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులను వేధించడం పక్కన పెట్టి ఎన్నికల మునుపు ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై దృష్టి పెట్టాలని కోరారు.

పర్యావరణాన్ని కాపాడాలి



రావివలసలో పర్యావరణంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

టెక్కలి: ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ అధికారిణి బి.కరుణశ్రీ కోరారు. ప్రతీ నెల మూడో శనివారం నిర్వహిస్తున్న స్వచ్ఛ ఆంధ్ర– స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా టెక్కలి మండలం రావివలస గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో బీట్ ది హీట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల పరిసరాలను శుభ్రం చేసి అనంతరం గ్రామస్తులతో కలిసి 150 మొక్కలను నాటారు. అలాగే పలాస ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో ప్రయాణికులకు మజ్జిగ, శీతల పానీయాలు పంపిణీ చేసినట్లు కరుణశ్రీ వెల్లడించారు. జిల్లా కేంద్రంతో పాటు వివిధ ప్రాంతాల్లో కోనేరులతో పాటు పార్కులు శుభ్రం చేసినట్లు చెప్పారు. పక్షుల దాహార్తిని తీర్చేందుకు నీటి తొట్టెలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

22న హనుమాన్ జయంతి

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని 20వవార్డు ఆర్టీసీ కాంప్లెక్స్ దగ్గర లేబర్ కాలనీలో ఈనెల 22వ తేదీన అభయాంజనేయస్వామి జయంతి ఉత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆ రోజు ఉదయం ఆరు గంటలకు పూజా కార్యక్రమాలు, పంచామృతాభిషేకం, అర్చనలు, అన్నదాన కార్యక్రమాలు ఉంటాయన్నారు. భక్తులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

నేడు యూవీవీ 23వ వార్షికోత్సవం

పలాస: పలాస మండలం నీలావతి గ్రామంలోని యూవీవీ గ్రంథాలయంలో ఆదివారం ఉద్దానం ప్రాంత విద్యాభివృద్ధి వేదిక 23వ వార్షికోత్సం జరగనుంది. ఈ విషయాన్ని వేదిక అధ్యక్షుడు బొమ్మాళి శివప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిభావంతులైన ఉపాధ్యాయులు, కవులు, కళాకారులను సన్మానించనున్నట్టు పేర్కొన్నారు. అలాగే ఉత్తమ విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలను ప్రదానం చేస్తామన్నారు.

కాలువలు ఇలా.. నీరు పారేది ఎలా!

- అధ్వానంగా సాగు నీటి కాలువలు
- పూడికలు తొలగించాలని కోరుతున్న రైతులు



టెక్కలి ఆర్టీసీ డిపో ఎదురుగా అధ్వానంగా ఉన్న సాగునీటి కాలువ

టెక్కలి:

టెక్కలి మండలంలో సాగునీటి కాలువలు అధ్వానంగా మారాయి. పూడికలు తొలగించకపోవడంతోపాటు ఏపుగా పెరిగిపోయిన పిచ్చిమొక్కలతో కాలువలు రూపాన్ని కోల్పోయాయి. దీంతో ఖరీఫ్ సీజన్‌లో పొలాలకు సాగునీరు సక్రమంగా అందకపోవచ్చునని రైతులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే రబీలో సాగునీటి ఇబ్బందులతో పూర్తి స్థాయిలో పంటలను సాగు చేయలేకపోయామని రైతులు చెబుతున్నారు. టెక్కలి మండలంలో వంశధార ఎడమ ప్రధాన కాలువతో పాటు అనుసంధానంగా టెక్కలి, సంతబొమ్మాళి మండలాల్లో దిగువ ప్రాంతాలకు వెళ్తున్న చిన్న పాటి సాగు నీటి కాలువలు సైతం అధ్వానంగా కనిపిస్తున్నాయి. సంబంధిత అధికారులు దృష్టిసారించి ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందే కాలువల్లో పూడికలను తొలగించడంతోపాటు జంగిల్ క్లియరెన్స్ పనులు పూర్తి చేయాలని రైతులు కోరుతున్నారు.



టెక్కలి చేరీవీధి సమీపంలో పూడికలతో నిండి ఉన్న సాగునీటి కాలువ.



టెక్కలి ఊర చెరువు ఎదురుగా గుర్రపు డెక్క, జంగిల్‌తో నిండి ఉన్న నీటి కాలువ.

పూడికలు తొలగించాలి...



మరికొద్ది రోజుల్లో ఖరీఫ్ సీజన్ ఆరంభం కానుంది. వర్షాలు పడక మునుపే సాగు నీటి కాలువల్లో పూడికలు తొలగించాలి. అధికారులు గుత్తేదారులతో కుమ్మక్కు కాకుండా రైతుల ప్రయోజనాన్ని ఆలోచించి సాగు నీటి కాలువల్లో పూడికలు తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలి.

–హెచ్.వెంకటేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్, టెక్కలి

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాశీబుగ్గ: మున్సిపాలిటీ పరిధిలోని 33/11 కేవీ సబ్ స్టేషన్‌లో మరమ్మతులు, చినబడాం 11 కేవీ ఫీడర్‌లో కొత్త లైన్ల ఏర్పాటు పనులను ఆదివారం చేపట్టనున్నామని దీంతో పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరాను నిలిపి వేయనున్నట్టు పలాస డివిజన్ విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.యజ్ఞేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం పది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు అనంతపురం, జీఎంఈ, కొబ్బరిచెట్లూరు, ఆర్‌కేపురం, పెంటిబద్ర, జయరామచంద్రపురం, పద్మనాభపురం, ఓల్డ్‌ఎన్‌హెచ్–5 రోడ్డు, తాళభద్ర, నీలాపురం, నర్సిపురం, రైల్వే గేట్‌డౌన్, పెసరపాడు, చినబడాం, అంతరకుడ్డ, రాజపురం గ్రామాల పరిసర ప్రాంతాలకు సరఫరాను నిలిపి వేస్తామన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

కుట్టు శిక్షణ కేంద్రం తనిఖీ



శిక్షణ పొందుతున్న వారితో మాట్లాడుతున్న కమిషనర్ రామారావు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల ప్రారంభించిన మహిళల కుట్టుమిషన్ శిక్షణ కేంద్రాన్ని కమిషనర్ నడిపేన రామారావు శనివారం తనిఖీ చేశారు. మహిళలతో మాట్లాడి శిక్షణ ఎలా జరుగుతుందో అడిగి తెలుసుకున్నారు. రోజూ 75 శాతం మంది శిక్షణకు హాజరయ్యేలా చూడాలని నిర్వాహకులకు సూచించారు. 90 రోజులు శిక్షణ పూర్తి చేసుకున్నవారికి సర్టిఫికెట్‌తో పాటు ఉచితంగా కుట్టు మిషన్‌ను అందజేస్తామన్నారు.

పంపుహౌస్ పరిశీలన



పంపుహౌస్‌ను పరిశీలిస్తున్న అధికారులు

ఇచ్ఛాపురం టౌన్: ఇచ్ఛాపురం పట్టణానికి నీటిని సరఫరా చేస్తూ ఇటీవల పాడైన సంతపేట వద్ద ఉన్న పంపుహౌస్‌ను అధికారులు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా పబ్లిక్ హెల్త్ ఎస్ఈ పి.కామేశ్వరరావు మాట్లాడుతూ.. ఇచ్ఛాపురం పట్టణ ప్రజలకు మంచినీటి సమస్య లేకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. పంపుహౌస్‌కు మరమ్మతులు చేయడం లేదా పునర్నిర్మాణం చేసి ప్రజలకు నీటిసమస్య లేకుండా చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ ఎన్.రమేష్‌కు ఆదేశించారు. ఈ పరిశీలనలో డీఈ సుధాకర్, ఏఈలు జగన్నాథం, అవినాష్ ఉన్నారు.

మహిళలపై వివక్షత చూపితే చర్యలు



మాట్లాడుతున్న జడ్జి మాధురి

కాశీబుగ్గ: పని ప్రదేశాల్లో మహిళలపై ఎటువంటి వివక్ష చూపకూడదని పలాస జూనియర్ సివిల్ జడ్జి యు.మాధురి అన్నారు. అటువంటి పరిస్థితులు వస్తే ఫిర్యాదు చేస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయని చెప్పారు. పలాస కోర్టులో పారాలీగల్ వలంటీర్లతో అవగాహన సదస్సును శనివారం నిర్వహించి మాట్లాడారు. మహిళపై వివక్ష చూపిస్తున్నట్టు నిర్ధారణ జరిగితే రూ. 50 వేల అపరాధ రుసుము, రెండోసారి జరిగితే రెట్టింపు అపరాధ రుసుంతో పాటు శిక్ష ఉంటుందన్నారు. కార్యక్రమంలో ప్యానెల్ న్యాయవాదులు బి.కామేశ్వరరావు, బి.రవికుమార్, వి.రవి, రజినీకుమార్, శ్యాంసుందరరావు, రాజరత్నం నాయుడు పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుతో భూమి సారవంతం



రైతులను సత్కరిస్తున్న దృశ్యం

కవిటి: ఖరీఫ్‌లో ప్రధాన పంటల సాగుకు ముందు నవధాన్యాలను సాగు చేయడం ద్వారా భూమి సారవంతం అవుతోందని ఏపీఎం కె.గోవిందరావు అన్నారు. శిలగాం గ్రామంలో నవధాన్యాల సాగు–నేలతల్లికి బాగు కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. నవధాన్యాల సాగుతో రైతులకు చేకూరనున్న లబ్ధిపై అవగాహన కల్పించారు. అనంతరం రైతులకు నవధాన్యాల కిట్లను పంపిణీ చేశారు. అనంతరం ఉత్తమ రైతులను సత్కరించారు.

చిన్నకొజ్జిరియాలో..

కంచిలి మండలంలోని చిన్నకొజ్జిరియా గ్రామంలో నవధాన్యాల సాగుపై మండల వ్యవసాయఅధికారి ధనుంజయ శనివారం అవగాహన కలిగించారు. ఖరీఫ్ ప్రణాళిక కోసం వివరించారు. మార్కెటింగ్ సర్టిఫికెషన్, నాటు ఆవుల కొనుగోలు గురించి వివరించారు. ఆదర్శ రైతులు గొనప పద్మనాభం, పూడి సుధాకర్, మదన్‌మోహన్‌లను సత్కరించారు. కార్యక్రమంలో రమణమూర్తి, ప్రమీల, మోహన్, మీనా ఉన్నారు.

వనరులపై అవగాహన



వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మందసలోని గ్రంథాలయంలో శనివారం నీరు మీరు–స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు ప్రకృతి వనరులపై అవగాహన కల్పించారు. పిల్లలతో మొక్కలను నాటించారు. ప్రతిఒక్కరూ మొక్కలను నాటి పెంచాలని ఉపాధ్యాయుడు టి.జయరాం అన్నారు. గ్రంథాలయధికారి జె.విజయలక్ష్మి పాల్గొన్నారు.

–మందస

భూమిపూజ



ఇచ్ఛాపురం మున్సిపాలిటీలో ఆటోస్టాండ్ నిర్మాణానికి జూనియర్ సివిల్ జడ్జి పరీక్షుమార్ శనివారం భూమిపూజ చేసారు. స్థానికంగా ఆటోలు పెట్టు కొనేందుకుందుకు స్థలం లేదు. దీని కోసం ఇటీవల జరిగిన మేడే కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి దృష్టికి తమ సమస్యను డ్రైవర్లు తీసుకెళ్లారు. సమస్య పరిష్కారమయ్యేలా ఆయన చర్యలు చేపట్టారు. స్థానిక సీఐ చిన్నమనాయుడు, మున్సిపల్ కమిషనర్ ఎన్.రమేష్ పాల్గొన్నారు.

–ఇచ్ఛాపురం టౌన్

సందడిగా సంబరం



మనిషికి సేవలతో పాటు ఆధ్యాత్మిక ప్రశాంతత ఎంతో అవసరమని జెడ్పీ చైర్‌పర్సన్, వైఎస్సార్‌సీపీ ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త పిరియా విజయ అన్నారు. తిప్పనపుట్టుగలో మజ్జి వంశీయులు శనివారం నిర్వహించిన దేవుని సంబరంలో ఆమె పాల్గొన్నారు. మాజీ ఎంపీపీ బెందాళం జయప్రకాశ్, బెంతు ఒరియా సంఘ నాయకులు పాల్గొన్నారు.

–ఇచ్ఛాపురం రూరల్

క్రికెట్‌టోర్నీ విజేత బారువ



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్సీ రామారావు

కవిటి: మండలంలోని జమేదారుపుట్టుగ మైదానంలో రాపాకపుట్టుగకు చెందిన శ్యామలమ్మక్లబ్‌చే నిర్వహించిన నియోజకవర్గస్థాయి క్రికెట్ టోర్నీ ఉత్సాహంగా జరిగింది. విన్నర్‌గా బారువ, రన్నర్‌గా గొనపపుట్టుగ జట్లు నిలిచాయి. శనివారం జరిగిన బహుమతి ప్రదానోత్సవంలో ఎమ్మెల్సీ నర్తు రామారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు కడియాల ప్రకాష్, నర్తు చామంతి,నర్తు శివాజీలు పాల్గొన్నారు. బారువ జట్టుకు రూ.25 వేలు, గొనపపుట్టుగ జట్టుగా రూ. 15 వేలు నగదుతో పాటు షీల్డ్‌లను అందజేశారు.

కోటబొమ్మాళిలో తిరంగ ర్యాలీ



తిరంగ ర్యాలీలో మంత్రి అచ్చెన్నాయుడు తదితరులు

టెక్కలి: పహల్గాం దాడికి ప్రతీకార చర్యగా భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడంతో శనివారం కోటబొమ్మాళిలో తిరంగ ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడుతో పాటు కూటమి కార్యకర్తలంతా జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించి భారత సైన్యానికి మద్దతుగా నినాదాలు చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. ఆపరేషన్ సిందూర్‌తో భారత సైన్యం సత్తా నిరూపించారన్నారు. కార్యక్రమంలో టెక్కలి ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి, నాయకులు బి.రమేష్, బి.గోవిందరాజులు, ఎల్.ఎల్.నాయుడు, పి.అజయ్‌కుమార్, కె.కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

ఎండ బారినపడొద్దు

ఇచ్ఛాపురం టౌన్: ఎండబారిన పడకుండా ప్రతీఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పి.రాజలక్ష్మి అన్నారు. బీట్ ద హీట్ కార్యక్రమంలో భాగంగా ప్రజలు ఎండబారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై బెల్లుపడ గ్రామంలో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ రాజలక్ష్మి మాట్లాడుతూ.. ఎండ సమయాల్లో బయటకు రావడం తగ్గించుకోవాలని, తరచూ నీరు, మజ్జిగ తాగుతూ శరీర వేడిని తగ్గించుకోవాలని తెలిపారు. ఈకార్యక్రమంలోమున్సిపల్ కమిషనర్ ఎన్ రమేష్, శానిటరీ ఇనస్పెక్టర్ ఉపేంద్ర కుమార్,మహిళలు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో రూ. 1.20 లక్షల జరిమానా

కాశీబుగ్గ: కాశీబుగ్గ పోలీసు స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాలలో ఇటీవల డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వారికి పలాస జూనియర్ సివిల్ కోర్టులో అపరాధ రుసుము విధించారు. సీఐ సూర్యనారాయణ నమోదు చేసిన కేసులపై పలాస జూనియర్ సివిల్ జడ్జి యు.మాధురి శనివారం తీర్పునిచ్చారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన 12 మందికి ఒక్కొక్కరికీ రూ. పది వేల చొప్పున లక్షా ఇరవై వేల రూపాయలు అపరాధ రుసుము విధించినట్లు కాశీబుగ్గ పోలీసులు తెలిపారు.

కళింగ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం

సోంపేట: సోంపేట పట్టణ కళింగ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షునిగా పండి కృష్ణారావు, అధ్యక్షునిగా తమ్మినేని శేషయ్య, సలహాదారునిగా డాక్టర్ రాజేంద్రప్రసాద్, ఉపాధ్యక్షునిగా పి.శ్రీధర్, కార్యదర్శిగా వజ్జ కృష్ణారావు, సంయుక్త కార్యదర్శులుగా పి.సునీల్, పి.రమణమూర్తి, కోశాధికారిగా డి.చలపతిరావు ఎన్నికయ్యారు.

రైతు కుటుంబాన్ని ఆదుకోవాలని వినతి

కాశీబుగ్గ: కంచిలి మండలం పెద్దకొజ్జిరియా గ్రామానికి చెందిన రైతు బల్లెడ నరసింహామూర్తి అప్పుల బాధలు తాళలేక ఇటీవల పురుగు మందు తాగి మరణించాడు. తక్షణమే రైతు కుటుంబానికి న్యాయం చేయాలని ప్రజా సంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు ఆర్డీవో జి.వెంకటేష్, డీఎస్పీ వెంకట అప్పారావులకు మృతుని కుటుంబ సభ్యులతో కలిసి శనివారం వినతి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సంఘాల కార్యదర్శి డిల్లీరావు, మృతుని కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నేటినుంచి కిల్లమ్మతల్లి సంబరాలు

మందస: సిద్దురు గ్రామంలోని కిల్లమ్మతల్లి సంబర మహోత్సవాలను ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉత్సవానికి కావాల్సిన అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు.

మేఘామాలలో మంగళమ్మ తల్లి సంబారాలు

మేఘామాల గ్రామంలో మంగళమ్మ తల్లి సంబరాలు ఆదివారం నుంచి ఈ నెల 20వ తేదీ వరకు జరుగుతాయని కమిటీ సభ్యులు తెలిపారు.

పశువులు తరలిస్తున్న ఇద్దరు అరెస్టు

కాశీబుగ్గ: నిబంధనలకు విరుద్ధంగా పశువులను తరలిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్టు పోలీసులు తెలిపారు. లక్ష్మీపురం గ్రామ సమీపంలో కాశీబుగ్గ పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. బొలేరో వాహనంలో ఆరు పశువులను నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తున్నట్టు గుర్తించారు. దీంతో అద్దపనస గ్రామానికి చెందిన కొల్లి జనార్దన, నారాయణవలస గ్రామానికి చెందిన రౌతు సీతారాములను అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. వాహనాన్ని సీజ్ చేసినట్టు హెచ్‌సీ రవి కుమార్ చెప్పారు.